క్లుప్తంగా

6న మండల సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 6వ తేదీన జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల ప్రజాపరిషత్ సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు నివేదికలతో సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

లింగాపూర్: మండల కేంద్రంలోని శనివారం ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదినం సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు ధ్రువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ జాటోత్ రాహుల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆత్రం అనిల్‌కుమార్‌లు విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆత్మారామ్, మాజీ సర్పంచ్ చిరంజీవి, రమేశ్, వినోద్ ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో పదో తరగతి విద్యార్థులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థులకు అవసరమైన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, తదితర సామగ్రి అందజేశారు. పాఠశాల ప్రతినిధులు కృష్ణమాచార్యులు, మధూకర్, సంతోష్, శ్రీరాం సత్యనారాయణ, దీపక్, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

పీఎన్‌పీఎస్ గ్రామ కమిటీలు ఎన్నిక

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం, హీరాపూర్ గ్రామాల్లో శనివారం పేదరిక నిర్మూలన పోరాట సమితి (పీఎన్‌పీఎస్) గ్రామ నూతన కమిటీలను రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. భూపాలపట్నం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కనకమండ్ల నాగన్న, ఉపాధ్యక్షుడిగా గడ్డి రామయ్య, ప్రధానకార్యదర్శిగా మొగిలి పోచయ్య, కార్యదర్శిగా పొరిశెట్టి సాంబయ్య, గౌరవ అధ్యక్షుడిగా నక్క నానయ్య, హీరాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా టీకం హన్మంతు, ఉపాధ్యక్షుడిగా టీకం భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా గాడి నాని, కార్యదర్శిగా టీకం రాజేశ్, మహిళా అధ్యక్షురాలిగా టీకం భూదక్క, ఉపాధ్యక్షురాలిగా కమ్మరి పార్వతి, ప్రచార కార్యదర్శిగా టీకం భీంరావ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బెజ్జూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్న సందర్భంగా శనివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ యాదవ్, నాయకులు ఆత్రం రాజారాం, విష్ణుమూర్తి, సత్తయ్య, హన్మంతు, అంకులు, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు


సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం ద్వితీయ సంవత్సర పరీక్షల్లో మొత్తం 226 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 225 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు సీఎస్ రమేశ్ తెలిపారు. వొకేషనల్ పరీక్షకు 17 మందికి గాను 17 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఎస్సై దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు పొదుపు పాటించాలి

కౌటాల: విద్యార్థి దశ నుంచి పిల్లలు పొదుపు అలవర్చుకోవాలని బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. శనివారం టీజీబీ బ్యాంకు ఆధ్వర్యంలో కౌటాల భారతి విద్యామందిర్ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. హెచ్ఎం దుర్గం గోపాల్, బ్యాంకు సిబ్బంది మనోహర్, రాజేశ్, గోపి, భాస్కర్, నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీజీటీలో ప్రతిభ


ఆరిఫ్


సిద్ధార్థ

వాంకిడి: గురుకులాల ఉద్యోగ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన యువకులు సత్తాచాటారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన చునార్‌కార్ సిద్ధార్థ (ఇంగ్లిష్), ఇంద్రానగర్ కాలనీకి చెందిన మహ్మద్ ఆరిఫ్ (సోషల్)లు గురుకుల టీజీటీ ఉద్యోగాలు సాధించారు.

ఎండిపోతున్న ప్రకృతివనాలు

- మొక్కల నిర్వహణపై పట్టింపు కరువు
- దృష్టి సారించని అధికారులు
- పట్టించుకోకుంటే మరింత నష్టం


ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు



గోండుకోసారలోని ప్రకృతి వనం

వాంకిడి: ప్రతీ పల్లెలో ఆహ్లాదకర వాతావరణాన్ని అందించడంతో పాటు పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రెండేళ్ల పాటు మొక్కలు పెంచడం, రకరకాల మొక్కల సేకరణతో పాటు, వనంలో కలుపు తొలగించడం వంటి పనులను ఈజీఎస్ పర్యవేక్షణలో నిర్వహించారు. వాటికి నిధులు సైతం ఉపాధి హామీ నుంచి కేటాయించారు. రెండేళ్ల తర్వాత ప్రకృతి వనాల నిర్వహణ గ్రామపంచాయతీలకు అప్పగించారు. మూడేళ్ల పాటు వనాల సంరక్షణ పర్వాలేదనిపించినా ప్రస్తుతం మండలంలో మొక్కల నిర్వహణ గాలికొదిలేస్తున్నారు. ప్రకృతి వనాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి.

నిర్వహణపై నిర్లక్ష్యం..

నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, పర్యవేక్షణ మూడేళ్ల క్రితం వరకు సజావుగానే సాగింది. మండల, జిల్లాస్థాయి అధికారులు తరుచూ వనాలను పరిశీలించి తగు సూచనలు, హెచ్చరికలు చేస్తుండేవారు. ఏడాది కాలంగా పల్లెప్రకృతి వనాలు నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొక్కలకు నీరు పట్టడం, కలుపు మొక్కలు తొలగించడం వంటి పనులను పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో చాలా చోట్ల మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వనాలు పంచాయతీల నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతున్నాయి. చాలా చోట్ల సరైన గేట్లు, కాంపౌండ్‌లు లేక ఏపుగా పెరిగిన మొక్కలను పశువులు తింటున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారడంతో పాటు కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నందున ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మొక్కలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

సంబంధం లేదంటున్న అధికారి..

ప్రకృతి వనాల నిర్వహణలో జరుగుతున్న నిర్లక్ష్యంపై మండల పంచాయతీ అధికారి జావెద్‌ను 'సాక్షి' వివరణ కోరగా ప్రకృతి వనాల నిర్వహణపై తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పల్లె ప్రకృతి వనాల నిర్వహణను ఈజీఎస్ వారే చూసుకుంటున్నారని, పంచాయతీ కార్యదర్శిని కానీ ఎంపీడీవోను కానీ అడగాలన్నారు. చివరికి కొత్తగా విధుల్లో చేరానని తెలుసుకొని చెబుతానని సమాధానం ఇచ్చారు.

వనాలు సంరక్షించుకోవాలి



పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను సంరక్షించుకోవాలి. పెరుగుతున్న ఎండను దృష్టిలో పెట్టుకొని అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. పంచాయతీ నిధుల నుంచి రూ.లక్షలు వెచ్చించి గేట్లు, బోర్డులు, ప్రహరీలు ఏర్పాటు చేశారు. కానీ చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. అధికారులు ప్రజాధనం వృథా కాకుండా చూడాలి.

– దుర్గం దినకర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

శ్రీపాదరావు సేవలు అభినందనీయం

- అదనపు కలెక్టర్ దాసరి వేణు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్: మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో శనివారం దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలతో కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మూడు సార్లు మంథని ఎమ్మెల్యేగా, శాసన సభాపతిగా అనేక పదవుల్లో ప్రజలకు సేవలందించారన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ శ్రీపాద రావు జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. హరీశ్‌బాబు మాట్లాడుతూ శ్రీపాద రావు ప్రజా శ్రేయస్సుకు కృషి చేశారన్నారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డీఆర్‌డీవో సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 87వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎంపీడీవో కృష్ణారావు, కార్యాలయం సిబ్బంది సుధాకర్, ప్రసాద్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఆవరణలో శనివారం మాజీ అసెంబ్లీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, పర్సనల్‌మేనేజర్ తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న రాంపూర్ గ్రామస్తులు

రెబ్బెన: తమ గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి రోడ్డు సౌకర్యం కల్పించాలని శనివారం రాంపూర్ గ్రామస్తులు గ్రామ బస్టాండ్ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు కాగా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొన్ని రోజుల క్రితం పనులు ప్రారంభించాడన్నారు. కానీ మండలంలోని కొందరు ప్రజాప్రతినిధులు పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. వెంటనే పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలపడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వంశీ, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’ జీరో బిల్లులు పంపిణీ


దహెగాం: లబ్ధిదారులకు జీరో బిల్లు అందజేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ


సిర్పూర్(టి): గృహజ్యోతి జీరో బిల్లు అందజేస్తున్న అధికారులు

దహెగాం: గృహజ్యోతి పథకాన్ని మండలంలో శనివారం ప్రారంభించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో 200 యూనిట్ల లోపు నమోదైన బిల్లులకు జీరో బిల్లులు అందజేశారు. మండల కేంద్రంలోని లబ్ధిదారులకు గృహజ్యోతి జీరో బిల్లులను అందజేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ తెలిపారు. జీరో బిల్లు రాని వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంటు బిల్లు ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జేఎల్ఎం పురుషోత్తం, సిబ్బంది ఉన్నారు.

సిర్పూర్(టి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం అమలులో భాగంగా శనివారం మండలంలోని వేంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఈర్త సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు గృహలక్ష్మి జీరోబిల్లులు పంపిణీ చేశారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో అర్హులకు జీరో బిల్లులు అందజేస్తామన్నారు. విద్యుత్ శాఖ ఏఈ ఇర్ఫాన్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కెరమెరి: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల కంటే తక్కువ రీడింగ్ ఉండి జీరో బిల్లు రాని వారు సమాచారమివ్వాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లులతో విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓల్డ్‌కాలనీలో శనివారం గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ బిల్లులను విద్యుత్ అధికారులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి తుకారాం, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ గృహ వినియోగదారులు తెల్లరేషన్ కార్డు కలిగివుండి 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వారికి పథకం వర్తిస్తుందన్నారు. ఎవరికైనా అర్హత ఉండి రానట్లయితే మున్సిపల్ కార్యాలయంలో తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్‌బిల్లు తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. ఏఈలు కమలాకర్, జగన్మోహన్, సిబ్బంది శ్రీరాములు, భూమయ్య, మురళీ, ఎమ్మాజీ సతీశ్‌కుమార్, వెంకటేశ్, శ్యాంబాబు, శేఖర్, అన్వర్, యేసు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని శనివారం అమలు చేశారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లును జీఎం ఆపరేషన్స్ గౌతం రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ అందజేశారు. డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ ఇమ్రాన్, లైన్‌మెన్ శ్రీనివాస్, ఫోర్‌మెన్ నర్సింగ్, సిబ్బంది రాజ్‌కుమార్, లక్ష్మణ్, శేఖర్, జితేందర్, చిరంజీవిగౌడ్‌లు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చూడాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో

కెరమెరి: మండుతున్న ఎండల దృష్ట్యా నర్సరీలోని మొక్కలు ఎండకుండా చూడాలని ఎంపీవో ఎండీ అంజద్ అన్నారు. శనివారం మండలంలోని నిసాని గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఇంటి పన్నులు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. నర్సరీని సందర్శించి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కార్యదర్శి విలాస్ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

లింగాపూర్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కొట్టే ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెలలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఆసిఫాబాద్ కోర్టులో న్యాయమూర్తి వారికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి

కెరమెరి: నేటి నుంచి మూడు రోజులు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీహెచ్‌వో శ్రీనివాస్ రెడ్డి, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 3552 గృహాల్లో 3981 మంది 0–5 ఏళ్ల లోపు చిన్నారులు ఉన్నారని, వారందరికి పోలియో చుక్కలు వేయాలన్నారు.

నేటి నుంచి పల్స్ పోలియో

దహెగాం: పల్స్ పోలియో కార్యక్రమం మండలంలో ఆదివారం నుంచి కొనసాగుతుందని వైద్యాధికారి స్పందన అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 3,298 మంది ఉన్నారని, 58 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. మరో రెండు మొబైల్ టీంలు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

కౌటాల: మండలంలోని అన్ని గ్రామాల్లోని చిన్న పిల్లలకు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కౌటాల యునానీ వైద్యురాలు తస్మీయా శనివారం తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల పోస్టర్లను శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే జాతర పోస్టర్లను జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి విడుదల చేశారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు వానుపటేల్, మనిరాం, మారుతి, నితేష్, తిరుపతి, ప్రవీణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రధాన లక్ష్యం

జైనూర్: మహిళల ఆర్థిక ఎదుగుదలే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని 10 కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తొలివిడతలో తయారు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పోలింగ్‌పై అవగాహన కల్పించారు. డీపీఎంలు అన్నాజీ, రామకృష్ణ, సారయ్య, ఏపీఎంలు రాజ్‌కుమార్, కుమారి, శంకరయ్య, దేవానందం, సుజాత, సీబీవో ఆడిటర్స్ భీంరావు, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

బెజ్జూర్: ఆదిలాబాద్ కేంద్రంలో ఈనెల 4న నిర్వహించే విజయసంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణయాదవ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయసంకల్ప సభకు అన్ని గ్రామాల్లోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎంపీపీలు కొండ్ర మనోహర్‌గౌడ్, కొప్పుల శంకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి భిక్షపతి, నాయకులు తిరుపతి, దిగంబర్, రాజారం, వసీఉల్లాఖాన్, నారాయణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: ఆదిలాబాద్‌లో ఈనెల 4న చేపట్టనున్న విజయ సంకల్ప సభకు ప్రధాని మోదీ రానున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ రమేశ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వేలువాక శ్రీకాంత్‌చారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెంచికల్‌పేట్: ప్రధానమంత్రి మోదీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మాట్లాడారు. సోమవారం ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో విజయసంకల్ప యాత్ర కోసం పీఎం రానున్నట్లు తెలిపారు. మండలంలోని బీజేపీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రెబ్బెన: ఈనెల 4న ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆత్మారాం నాయక్ అన్నారు. శనివారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రవి, తిరుపతి, ప్రకాశ్, రోహిదాస్, గోవింద్‌నాయక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఈజ్‌గాం శివమల్లన్న జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని జరిగే జాతర పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న జాతర ఏర్పాట్ల పనులను కమిటీ సభ్యులు పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ మైలారపు మురళీధర్, సభ్యులు హరిప్రసాద్, సోనీ, ప్రసాద్, తిరుపతి, సత్తయ్య, శారద, రవికుమార్, అర్చకులు సంతోశ్ శర్మ, నరహరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఈవో అశోక్

వాంకిడి: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడంతో పాటు గణిత సమస్యలను పరిష్కరించేలా వారిలో ప్రావీణ్యాన్ని పెంపొందించాలని డీఈవో అశోక్ అన్నారు. శనివారం మండలంలోని సరాండి, బెండార, చిన్న బెండార పాఠశాలలతో పాటు మండల కేంద్రంలోని ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. గిరిజన శాఖ నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందించిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, గడియారాలను పంపిణీ చేశారు. పరీక్షల పర్యవేక్షణ అధికారి ఉదయ్‌బాబు, సైన్స్ అధికారి మధుకర్ ఉన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కౌటాల: ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులకు వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీవన సరళిలో మార్పులు, ఇతర కారణాలతో బాలబాలికలు రక్తహీనతతో బాధ పడుతున్నట్లు తెలిపారు. రక్త పరీక్షల్లో రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి మాత్రలు అందిస్తామన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత నివారణే ముక్త్ భారత్ లక్ష్యమన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, శుద్ధమైన నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో శనివారం ఎంఐఎం పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఐఎం జెండాను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్ మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జావెద్, నియాజ్, అబీద్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.